# గోదావరి

మెయిలు వాల్తేరు స్టేషను దాటేసరికి మధ్యాహ్నం పన్నెండుగంట లైంది భోజనం చేసి వచ్చిన మీదట రైల్లో పక్క పరుచుకుని నడుం వాల్చగానే నిద్ర ముంచుకొచ్చింది. బరువు కళ్లతోనే పడుకోబోయే ముందొకసారి పెట్టెలో కూర్చున్న వ్యక్తులందరినీ పరికించి చూశాను. నేను పడుకున్న సీటు మీద మరెవ్వరూలేరు. ఎదురుగా ఉన్న బెర్త్ మీద ఒక అరవావిడ చంటి పిల్లాణ్ణి జోకొడుతోంది. ఆవిడపక్కనే ఓ క్షోమ టావిడ ఒంటి నిండా వస్తువులు పెట్టుకుని పొందిగ్గా కూచుంది. ఆ పెట్టెలో పార్టిషన్ ఉంది. పక్క భాగంలోంచి పెద్ద పెద్ద కేకలూ పకపక నవ్వులూ వినిపిస్తున్నాయి. వింటూ వింటూ నిద్రపోయాను.

నాకు మెలుకువొచ్చేసరికి మెయిలు తుని స్టేషను చేరింది. కళ్ల నలుపుకుంటూ కంపార్ట్ మెంటంతా మళ్ళీకలయ జూశాను. ఎదురు సీటులో మరో పిల్లల తల్లి స్థలం ఆక్రమించుకుంది. ఉన్న పిల్లలు ఇద్దరేగాని కావలిసినంత గొడవచేస్తున్నారు. అమ్మకానికి వచ్చే ప్రతి వస్తూవూ కొనమని పేచీ పెడుతున్నారు ఓ మూల సీటు క్రింద ఉన్న జంతికల బుట్ట ఖాళీచేస్తూ.

ఇటు నా బెర్తుమీద ఓచివరగా ఒదిగి కూర్చుందో మనిషి. ఏ స్టేషనులో ఎక్కిందో తెలియదు. ఆ మనిషి వయస్సుకి చిన్నదే అయినా

సంస్కారం లేక బక్కచిక్కిన ఒళ్ళు, పాలిపోయిన చెక్కిళ్ళు, కళావిహీనమైన కళ్ళు, తైల సంస్కారంలేని జుట్టు, దుమ్ముకొట్టుకుపోయిన బట్టలు, చూడగానే అసహ్యం వేసింది. మేమున్న పెట్టెలో ప్రవేశించడానికి అర్హత లేని వ్యక్తి అని ఆమె వైఖరి సుస్పష్టం చేస్తున్నది. అడిగేద్దామనుకున్నాను ఈ పెట్టెలో కూర్చున్నావేమిటి, దిగి పొమ్మని-కాని అక్కడ కూర్చున్న వాళ్ళంతా పట్టించుకోనిదానికి నాకు మాత్రం ఎందుకు బాధ అని ఊరు కున్నాను. పైగా మరో సంఘటన చటుక్కన గుర్తొచ్చింది. వాల్తేరు వెళ్ళేటప్పుడు ఆడవాళ్ల కంపార్టుమెంటులో చోటులేక మగవాళ్ళదాంట్లో ఎక్కాను. అందులో ఒక వస్తాదు లాంటి మనిషి కూర్చున్నాడు గుమ్మం దగ్గరగా. పెట్టెలో ప్రవేశించే ముందు ఆయన గారి అనుమతి తీసుకుని మరీ ముందడుగు వెయ్యాలి. ఈలోగా ఓ ముసిలిది తడుముకుంటూ వచ్చి మా పెట్టెలో ఎక్కి ఓ మూల కూర్చుంది. పక్కవాళ్ళతో కబుర్లు చెబుతూ ఈ సంగతి ఆయన గమనించలేదు. కొంత సేపయాక హఠాత్తుగా చూశాడు. ఆ ముసిలిది మూల కూర్చుని కునికిపాట్లు పడుతోంది. 'ఎవర్తెవే నువ్వు?' అంటూ గర్జించాడు గుడ్లురుముతూ. ఆ అరుపుకి కునికిపాట్లు పడుతున్న ఆ ముసిలిదే కాదు, కంపార్టుమెంటులో కళ్ళు తెరుచుకొని కూర్చున్న మేమంతా ఉలిక్కిపడ్డాం. "ఏటి బాబూ?" అంది అయోమయంగా. "దిగుతావా దిగవా ముందు "అని బెదిరించాడు.

"అదేటి బాబూ, టిక్కెటు కొనుక్కొంటిని, సోటులేదని కిందనే కూకుండి పోతిని, కోంపడతావేటి బాబూ?"అంది. ఆ ముసిలిది చెప్పే మాటలు వినిపించుకోలేదు. "దిగుతావా, రెక్కట్టుకుని ఈడ్చి అవతల పారెయ్యమన్నావా? పరుపులపెట్టెలో ఎక్కడానికి ఎన్ని గుండెలుండాలే నీకు?" అంటూ కూర్చున్న చోటునుంచి జబర్దస్తీగా లేచి రెండడుగులు

ముందుకు వేశాడు. ఇక పరిస్థితి విషమించిందని తెలుసుకుని నా ప్రక్కన కూర్చున్న ఓ పెద్దమనిషి లేచి అతన్ని రెక్కపట్టుకొని కూర్చోబెట్టి "నీకేమన్నా మతి పోయిందేమిటి? ఎక్కితే ఎక్కింది, రైలు పరుగెడుతూంటే ఆ ముసలిముండని ఎక్కడికి దిగి పొమ్మంటావు?" అన్నాడు ప్రశాంతంగా మందలిస్తూ ఇక ఆ వస్తాదు తనకు జరిగిన అవమానాన్ని భరించలేక, పైకేమీ అనలేక, భీకరంగా నిట్టూర్చి ఊరుకున్నాడు.

కాస్సేపట్లో స్టేషను వచ్చింది. ఆ ముసిలిది ఎవరూ చెప్పకుండానే దిగిపోయింది. ఇంతలోకే టిక్కెట్టు కలెక్టరు గొంతు వినిపించింది పక్క కంపార్టుమెంటు గుమ్మం దగ్గరనుంచి. మావస్తాదు ఒక్కసారిఉలిక్కిపడి బాత్‌రూమ్‌లోకి ఒక్క ఉరుకులో వెళ్ళి తలుపేసుకున్నాడు. అందరం ఒకళ్ళ మొహాలొకళ్ళం చూసుకున్నాం. టిక్కెట్టు కలెక్టరువచ్చి అందరి టిక్కెట్లూ చూశాడు. ఓకొంటె కుర్రాడు నవ్వుతూ 'ఆ బాత్‌రూమ్‌లో ఇంకో ఆయన ఉన్నాడు సార్" అన్నాడు టిక్కెట్టు కలెక్టరుతో. మళ్ళీ వస్తానని అతను వెళ్లిపోయాడు. గమ్యస్థానం వచ్చేవరకూ ఆ వస్తాదు బయటికి రాలేదు మళ్ళీ.

అది తలుచుకుంటే నవ్వొచ్చింది. కాని ఆ అమ్మాయిని చూస్తున్న కొద్దీ కంపరం పుట్టుకొచ్చింది. అయితే మొహం ఎంత పక్కకి తిప్పుకుని కిటికీలోంచి ప్రకృతి దృశ్యాలు చూద్దామనుకున్నా, ఆమనిషికేసి పదేపదే నాదృష్టిని మరలించకుండా ఉండలేకపోయాను. ఆ అమ్మాయి నిశ్చలంగా కూర్చుంది. చూపులు శూన్యంగా ఉన్నాయి. ఒకసుఖం లేదు, ఒక విచారం లేదు, వైరాగ్యంలేదు. చైతన్యరహితంగా ఉన్నట్లున్నది. ఎక్కడి కెడుతోందో, ఏం సమాను తెచ్చుకుందో తెలుసుకుందామని వొంగి ఇటూఅటూ ఏమీ ఎరగనట్లు చూశాను. అధమం ఒక చేతిసంచీ అయినా లేదు కూడా.

చేతిలో చిన్న పర్సయినా లేదు. ముష్టిదేమోసనుకోవడానికీ వీల్లేదు. ఎంత చెడ్డా ముష్టెత్తుకునే మనిషి పరుపులపెట్టెలో కెక్కినా, సీటుమీదనే కూర్చునేటంత సాహసానికి పూనుకోదు. ఎవరో ఆ స్త్రీ, ఎక్కడికెడుతుందో ఎందుకలా నిమిత్తమాత్రంగా కూర్చుందో అక్కడ, కూడా ఎవరైనా ఉన్నారో లేదో? ఆలోచిస్తూకూర్చున్నాను.

పిఠాపురం స్టేషనులో రైలు ఆగగానే ఓ ముసలాయన ఓ గుడ్డి కుర్రాణ్ణి చేత్తోపట్టుకుని మా కంపార్టుమెంటు దగ్గరకొచ్చి కిటికీదగ్గర నిలబడ్డాడు. ఆయన్ని చూడగానే నాబెర్తుమీద కూర్చున్న అమ్మాయి లేచి కిటికీ దగ్గరికెళ్లింది. అంతవరకూ కిటికీ దగ్గర కూర్చున్నదాన్ని బెడ్డింగు ఇవతలకు లాక్కొని కూర్చున్నాను. ఆ అమ్మాయి కిటికీదగ్గర కూర్చుంది. వాళ్ళు అట్టే ఏమీ మాట్లాడుకోలేదు. వాళ్లు మాట్లాడుకున్న ముక్కలు నాకు వినిపించనూ లేదు. రైలు కదిలే వరకూ పేపరు చదువుతూకూర్చున్నాను.

'ఎంతదాకా వెడుతున్నారండీ'? ప్రశ్నవిని పేపరు పక్కన పెట్టి తలపైకెత్తాను. ఆ అడిగినది ఎవరో అర్థం కాక ఎటువైపు చూడాలో తెలియలేదు. కోమటావిడ మెళ్లో తలక్రిందులుగా పడిన నెక్లెసు సర్దుకుంటోంది. ఆవిడ అడిగి ఉండదు. అరవావిడకు తెలుగువచ్చి ఉండదు. వచ్చినా అంత తెలుగుతనం ఉట్టిపడేలా మాట్లాడటం సంభవంకాదు. ఇంకో ఆవిడ పిల్లలిద్దరికీ ఏదో తిండి పెడుతోంది. అయితే నా బెర్తుమీద కూర్చున్న అమ్మాయే అడిగి ఉంటుందా? సమాధానం చెప్పకుండా ఆ అమ్మాయికేసి చూశాను, ఇంతకీ అడిగింది నన్నోకాదో అనుకుంటూ.

'ఎక్కడదిగుతారండి?' అంది, ఈసారి నన్నే అడిగింది నాకేసి చూస్తూ.

'గోదావరిలో' అన్నాను చిరునవ్వు నవ్వీ నవ్వకుండా.

'గోదావరిలో దిగవలసింది నేనండి' అంది. వేళాకోళంగా అన్నట్టులేదు—నిశ్చలంగా దృఢంగా అన్నదా మాటలు. నా మనస్సు చివుక్కుమంది. లేకపోతే ఆ అమ్మాయితో సరసమేమిటి నాకు! పాపం ఎంతబాధనూ, ఎన్ని కష్టాలనూ జీర్ణించుకున్న మీదట అనగలిగిందో ఆ మాటలు. అడుగుదామనుకున్నాను, ఆ అమ్మాయి ఆ మాట అనడానికి గల కారణమేమిటని. కానీ, అపరిచితులతో పూసుకుని మాట్లాడే స్వభావం కాదు నాది. కొందరు రైలు ఎక్కి ఎక్కడంతో ఎంత అపరిచితులతో నైనాసరే మాటలు కలిపి తమ పుట్టు పూర్వోత్తరాలన్నీ ఏకరవు పెట్టు కుంటారు. ఎవరైనా నన్ను పలకరించి ఏదైనా అడిగినా ముక్తసరిగా సమాధానం చెప్పి ముభావంగా కూర్చుంటానుగాని, మాటకు మాట కలిపి స్నేహం చేసే చాకచక్యం లేదు నాలో. మాటల్లో అడగకపోయినా, నా మనస్సులోని ఆసక్తిని అర్థం చేసుకుందో ఏమో. ఆ అమ్మాయే మాట్లా డటం మొదలు పెట్టింది.

'ఇందాక ఇక్కడకొచ్చి నాతో మాట్లాడి నాయన మానాన్న అండి' అంది. 'ఊఁహూ' అన్నాను, ఏమీ అనకపోతే నాకిష్టంలేదని ఆమెగాథను వినిపించడం ఎక్కడ మానేస్తుందోనని.

'ఒక్కడే తమ్ముడండి. వాడికి కళ్ళు లేవు. వాడు పుట్టుకతోనే దురదృష్టవంతుడండి. అమ్మ వాణ్ణి కనలేక పురుడొచ్చిన వెంటనే చచ్చి పోయింది. వాడికి కళ్లు లేవు...'

కాస్సేపు ఏమీ మాట్లాడలేదు. కొంపతీసి కథ అయిపోలేదు కదా? అబ్బే, అంత మాత్రానికే ఇంత కుమిలిపోతుందా? అదీకాక ఇన్నేళ్ళు గడిచాక ఇప్పుడే ఎందుకు పోవాలి చావు మీదికి దృష్టి! ఇంకా ఏదో ఉంది. చిన్నప్పుడు నాన్నగారి ఒళ్లో కూర్చుని, ఆయన హరిశ్చంద్రుడి కథ

చెబుతూ చెబుతూ మధ్యలో ఆగిపోతే, 'ఊఁ, చెప్పు, అప్పుడేమైంది?' అని కుతూహలంతో అడిగినట్లు, ఇప్పుడీ అపరిచితని ఎలా అడగడం, ఎంత ఆసక్తి ఉంటే మాత్రం?

పొలాలు చూడటం మానేసి నావైపు తిరిగింది.

'ఆ కళ్లు లేని కుర్రవాణ్ణి కన్నతల్లి కన్నా ఎక్కువగా చూసుకున్నాను. వాడు నా చేతుల్లో పెరిగి పెద్దవాడయ్యాడు. పెళ్ళయి నేను అత్తవారింటికి వెళ్ళేటప్పుడు, వాడి స్థితిచూస్తే ఎంతరాతిగుండె వాళ్ళకయినా జాలి కలక్క మానదు. వాడు నా కాళ్ళు పట్టుకుని బావురుమని ఏడ్చాడు వాణ్ణి నాతో తీసుకెళ్ళాలనుకున్నాను. కాని మా అత్తవారు కూడా అంత ఉన్నవాళ్ళేంకాదు. పైగా సవ్యమైన మనుషులు కూడా కారు. అందుకే నా బ్రతుకింత అధోగతిపాలై పోయింది—ఈ బంధువులను నమ్మినంత పాపం మరొకటి లేదు—"

ఆ మాటలు విని ఆ అమ్మాయి కళ్ళల్లోకి చూశాను. బంధువులపైన ఆమెకున్న ద్వేషమంతా ఆ కన్నుల్లోనే ప్రస్ఫుటమవుతోంది. క్షణకాలం కన్న ఆకన్నుల్లోకి చూడలేకపోయాను.

"కన్నతండ్రి అయినా చివరి కంతే—తన కొడుక్కి అంత సేవ చేశానని కించిత్తయినా కృతజ్ఞత ఉందా? నన్నొక చీడపురుగుని చూసినట్టు చూశాడు—నాకొడుకు నిర్భాగ్యుడైనాడని వాడిమీదేమైనా కనికరం చూపించాడా? మామొహం చూడటానికే కష్టమైపోయింది.

'మీ కొడుకేడీ?' అన్నాను.

'అదే చెబుతానుండండి, తొందరపడకండి' అంది. అక్కడికి నిజంగానే ఏదో కథ చెబుతున్నట్లుగానూ, ఆ విషయం ముందు చెప్పేస్తే సస్పెన్సు పోతుందన్నట్లుగానూ. మనస్సులోనే నవ్వుకుని ఊరుకున్నాను

'కన్నతండ్రికే నేనూ నాపిల్లలూ భారమైపోయినప్పుడు ఇక పరాయి వాళ్లకెలా ఉంటుంది చెప్పండి?'

'ఎంత మంది పిల్లలు?'

ఇద్దరండి, ఒక మొగపిల్లవాడు, ఒక ఆడపిల్ల. మావారు పోయి రెండేళ్లయిదండి...చెట్టంత మనిషినీ పొట్టని పెట్టుకున్నాడా మాయదారి పినతండ్రి.'

'ఏం, ఏమైంది? ఏం చేశాడాయన?' అని అడిగాను.

'మాతో ఎవరితోనూ చెప్పలేదండి... ఓనాడు వాల్తేరు పనుందని వెళ్ళిపోయి, పిన తండ్రి దగ్గరకెళ్ళి పిల్లలు పుట్టకుండా ఆపరేషను చెయ్యమన్నారటండి. ఆ పినతండ్రి ఓ యమధర్మరాజు, వాడు డాక్టరేమిటి? సరే చేస్తానన్నాటండి...పోనీ, తనకి చేతకాక పోతే చెప్పేదవరాదూ?— ఆపరేషను చెయ్యనూలేదు. చావనూలేదు. ఆపరేషను చెయ్యడానికి ముందు ఇంజక్షను ఇస్తూంటేనే ఆ మహానుభావుడి ప్రాణంకాస్తాహరీ అంది. నా ప్రాణానికి దాపురించాడా యముడు—

అసలే మాఅత్తకి ఒకళ్ళు పచ్చగాఉంటే సహించేగుణం లేదండి. నేనంటేనే కళ్ళల్లో నిప్పులోసుకుంటుంది. కొడుకున్నప్పుడే నన్ను అలా చూసేది, ఇక ఆ బంధం కూడా తెగిపోయాక ఇక ఆవిడకేమిటండి నాతో సంబంధం? ఆయన చావుకి నేనే కారణం అంటుందండి. పోనీ కొడుకు మీద అంత ప్రేమ ఉన్నది మనవల్ని దగ్గరుంచుకోవచ్చుకదండీ, నా పొట్ట నేనెలాగో చూసుకుందును—అబ్బే, మేము ఆ ఇంట్లో ఒక్కక్షణం ఉండటానికి వీల్లేదండి. ఇక మాకు దారేదండీ? పోనీ, మారెండో తోటి కోడలికి పిల్లల్లేరుకదా, వాళ్ళయినా అబ్బాయిని దగ్గర పెట్టుకుని చదువు చెప్పించకూడదండీ, వాళ్ళూ మాట్లాడకుండా ఊరుకున్నారు...మా

అత్తమ్మ నోటికి ఆ యముడు కూడా భయపడతాడేమో...ఇటు చూస్తే తండ్రి ఇంట్లో చోటులేదు...అటు విధాయకమైన భర్త ఇంట్లో స్థానం లేదు....పోనీ, నేను వేరే ఓగుడిసెలో ఉండి నా కుర్రాడికి చదువుచెప్పించు కుంటాను నెలకు పదో పదిహేనో పంపండి అన్నానండి...అందుకూ౯డా వాళ్ళకి గతి గడుక్కుపోయింది....జమాజట్టీల్లాంటి ముగ్గురు బావగార్లు న్నారు...ఏం లాభం? ...నా|బతుకంతా బుగ్గి అయిపోయాక వాళ్ళు కళ్లు తెరిచారు. ఇప్పుడందరూ సాయం చేస్తామని ముందుకురికేవారే... అవసర మొచ్చినప్పుడందరూ విసిరికొట్టారు...ఇప్పుడు నా|బతుకంతా చీకటిచేసి ఆ కుర్రాడుపోయాక అంతా కరుణ ఒలకపోసేవారే....

కసితో అంటోందా మాటలన్నీ. 'ఇంతకీ కుర్రాడికేమైంది?' అన్నాను, పోయాడు పోయాడు అంటూంటే.

'వాడికి నేనంటే రోతపుట్టినట్టుంది, వాళ్ళ నాన్నదగ్గరకే పోయాడు ...కాస్త అక్కరకొచ్చే మగపిల్లవాడు చేతులు దులుపుకు పోయాడు...

నేనోపని చేశానండి. అదేవాళ్ళందరికీ గుర్రు. నేను చెయ్యాలనే చేశాను" అంది చిరునవ్వుతో.

ఆ సమయంలో ఆ ముఖం మీదికి చిరునవ్వెలా వచ్చిందా అని ఆశ్చర్యపోయాను. ఏంచేసింది? అంత గర్వించేపని ఏం చేసింది చెప్మా? కొంపతీసి అవినీతికి పాల్పడలేదు కదా |బతుకు తెరువు కోసం?

'ఎవరితోనూ చెప్పలేదు. ఎవ్వరినీ సలహా అడగలేదు — అనకాపల్లి దగ్గరున్న అనాధా|శమంలో నాపిల్లలిద్దరినీ చేర్పించేశాను...'

తను చేసిన పనికి ఇప్పటికీ గర్విస్తూనే ఉన్నట్లుంది. ఆ ముఖంలో మందహాసం ఇంకా అలాగే ఉంది.

'చేర్పించిన తరువాత కూడా మొన్న మొన్నటి వరకూ ఎవరికీ తెలియదు.... వాళ్లెక్కడో అక్కడ బ్రతికి బట్టకట్టి చదువు, పనిపాటలూ నేర్చుకుంటే అంతేచాలు. ప్రస్తుతం వాళ్ళని ఒక దరికి చేర్చే శక్తి నాలో లేదు...నేను అట్టే చదువుకోలేదు, నాకేదైనా ఉద్యోగం ఎలా దొరుకుతుంది?'

అలా అని ఊరుకునే సరికి నాకనుమానమేసింది. కొంపతీసి నన్నిప్పుడేదైనా సలహా ఇమ్మంటుందేమోనని. ఉన్నట్టుండి ఎవరు మాత్రం ఏం చెప్పగలరు?

'అందుకని రాజమండ్రీ వెళ్ళి సీతానగరంలో ట్రెయినింగు సెంటరులో చేరిపోయాను. ఇప్పుడు ట్రెయినింగవుతున్నాను...అంతా బాగానే ఉందనుకున్నాను...ఏదో మెల్లిగా చిన్నపని దొరికితే నాపిల్లల్ని నాదగ్గరికి తెచ్చుకోవచ్చు. ఎలాగో తంటాలు పడవచ్చుననుకున్నాను....తానొకటి తలుస్తే దైవమొకటి తలుస్తాడు. మేము బాగుపడటం ఆ భగవంతుడికి కూడా ఇష్టం లేదు కాబోలు, నిక్షేపంలాంటి నాకుర్రాణ్ణి పొట్టబెట్టుకున్నాడు ...ఎంత తెలివైన వాడనుకున్నారు! మహచురుగ్గా ఉండేవాడు, ఆడపిల్లకన్న వాడే అందంగా ఉండేవాడు...అంతా తండ్రిపోలిక...అందుకే ఆ తండ్రినే చేరుకున్నట్లున్నాడు...'

నిబ్బరంగా చెబుతోంది. నేనైతే బొటబొట కన్నీళ్లు కార్చేద్దును అటువంటి పరిస్థితిలో నాకసలు నెత్తి మీద నీళ్ళకుండ ఉంటుంద. ఆ అమ్మాయి ఎంతగుండెదిట్ట మనిషో! ఎంత దుఃఖాన్ని దిగమింగి మాట్లాడుతోందో, పైగా చిరునవ్వుతో....

'కుర్రవాడెలా పోయాడు?' అని అడిగాను మళ్ళీ ఉండబట్టలేక.

'బావిలో పడ్డాడండి'

'అయ్యో! ఎక్కడ? ఆ అనాధాశ్రమంలోనే?'

'మరేనండి. కొత్తగా తవ్వించారటండి... దొంగచచ్చినాళ్ళు... ఆ బావిచుట్టూ ఏదైనా కట్టద్దండీ? అక్కడుండేవాళ్ళంతా పిల్లలు కదా... అందరూ నాప్రాణానికి ముప్పుతెచ్చేవాళ్ళే...పోనీ వాడుమాత్రం...కని కాకపోతే, చెప్పిన ముక్కవినొద్దూ...వింటే నాబ్రతుకు ఇలా ఎందుకవు తుంది? అందరు పిల్లల్లాగ బుద్ధిగా తిరగరాదూ? అక్కడికి వెళ్లొద్దు వెళ్లొద్దు అంటూంటే అక్కడికే వెళ్ళేవాడుటండి—అంతే, ఎవరూ లేనప్పుడు బకెటు తీసుకుని వెళ్ళాడుటండి నీళ్ళుతోడదామని—ఆ మాయదారి మను షులు చుట్టూ గోడ కట్టలేదుగా, అందులో కాలుజారి పడిపోయి ఉంటాడు ...ఆ సాయంకాలమో ఎప్పుడో....వీడు మధ్యాహ్నం పడిపోయినట్టున్నాడు ...బకెటుకోసం వెతుకుతూ ఆ కొత్తబావి దగ్గరకొచ్చాడుటండి అక్కడి మనిషెవడో—తీరా లోపలికి తొంగి చూస్తే తెల్లబట్టలు...కుర్రాడు కని పించాడుటండి...అప్పుడు లబో లబో మంటూ అందరినీ పిలిచి పైకి తీశారుటండి,...వెంటనే నాకో టెలిగ్రామన్నా ఇచ్చారా? నా ఒక్కగాని ఒక్కకొడుకు చివరిచూపు కూడా లేకుండా చేశారు. తాపీగా ఓకార్డు ముక్క రాసి పడేశారు. అది చూసుకుని వెంటనే పరుగెత్తుకెళ్ళాను... ఉన్నకూతురునైనా చూసుకుందామని దాన్నిచూస్తే గుండె తరుక్కు పోయింది. కాని ఏం చెయ్యను? నూటమూడు డిగ్రీల జ్వరంతో దాని ఒళ్లు సలసల కాగిపోతూ చలి జ్వరంతో గజగజ లాడుతూంటే దాన్నిఎక్కడికి తీసికెళ్ళగలను?...'

'ఏం? అక్కడ అనాధాశ్రమంలో వాళ్లే అన్ని సదుపాయాలూ ఏర్పాటు చేస్తారుగా!' అన్నాను.

'అదే నిజమైతే మన భారతదేశానికి గల విశిష్టత ఏమిటండీ?' అంది. ఈ ఎత్తి పొడుపుకి ఒళ్ళు మండింది నాకు ఏదైనా చెప్పినా చేసినా సమయోచితంగా ఉంటేనే హర్షించగల్గుతాం. ఆశ్రమంలో పరిస్థితులెలా ఉన్నాయో, చటుక్కున అంతమాట దేశాన్నే అనటం నేను సహించ లేక పోయాను. కాని, ఇప్పుడీ ప్రసక్తి మీద వాదన పెట్టుకు కూర్చుంటే ముందు కథ నడిపించదేమోనని మాట్లాడక ఊరుకున్నాను.

మళ్ళీ చెప్పడం మొదలెట్టింది.

'నేను ఆ ఊరికి వెళ్ళేసరికీ పిల్ల జ్వరంతో స్పృహలేకుండా పడి ఉందండి. జ్వరం ఎందుకొచ్చిందని అడిగాను అక్కడివాళ్ళని...నూతి లోంచి తీసిన కుర్రాడి శవాన్ని చూసి జడుసుకుందిటండి. నానాయన ఎంత అందంగా ఉండేవాడు, నీటిలో నానినాని ఎంత వికారంగా తయార యాడో ఏమో, పసిపిల్ల జడుసుకుని ఉంటుంది. ఎవరైనా డాక్టరుని పిలిచి మందిప్పించకుండా ఏవో ఆకులూ అవీ నూరిపోశారు టండి...పరిస్థితి మరీ విషమించింది. పిల్లకి సంధి వచ్చింది. దాని మాటలు వింటూంటే నాకే భయమేసింది. అక్కడున్న పిల్లలంతా హడలిపోతారు. ఎక్కడికైనా తీసుకుపొమ్మన్నారు....కాళ్ళావేళ్ళా పడి ప్రతిమాలాను ఆ ఆశ్రమం అధికారిని. చివరికి ఓ చిన్న గుడిసెలో చోటిచ్చారు...కాని శని అంతా నా నుదుటనే ఉన్నట్టుంది...ఆ గుడిసెలో ఏముహూర్తాన అడుగుపెట్టానో హోరున వర్షం ప్రారంభించింది. పిల్ల చలిజ్వరం తీవ్రతకి చాపమీంచి ఎగిరెగిరి పడుతోంది—బయట చెవులు చిల్లులు పడేటంత శబ్దంతో కుంభవృష్టి. పిల్ల ఒంటి మీద కప్పేందుకొక బొంత కూడా లేదు. పిల్లని నా ఒళ్ళోకి తీసుకుని గట్టిగా కావిలించుకుని కూర్చున్నాను. పిల్ల గజగజ లాడుతున్న కొద్దీ గుండెలకు మరింత అదిమి అదిమి పట్టుకున్నాను.

కొంత సేపటికి కుదుపు తగ్గింది...వర్షం హోరు కూడా తగ్గింది...పిల్ల నిద్ర పోతోంది...ప్రశాంతంగా నిద్రపోతోంది...దానికి ఈ పాపిష్టి తల్లి ఒళ్లోనే సుఖం లభించిందేమో...దాని ప్రశాంత వదనం చూస్తూ చూస్తూ నా కన్నులు కూడా మూతలు పడ్డాయి.

హఠాత్తుగా కుంభవృష్టి మళ్ళీ ఆరంభమైంది. నాకు మెలకువొచ్చింది....గుడిసెమీద ధన ధన మని చప్పుడు...గుడిసెచీకి పోయి కూలి పోవడానికి సిద్ధంగా ఉంది. వెదురు కర్రలు ఊగిసలాడిపోతున్నాయి...నా ఒళ్లు ఉన్నట్టుండి ఝల్లుమంది విపరీతమైన చలితో ఒళ్లో పిల్లని చూశాను...ప్రశాంతంగా నిద్రపోతోంది...దాని శరీరాన్ని స్పృశించి చూశాను.. అప్పటికిగాని అది శాశ్వత నిద్రలో ఉందన్న సంగతి స్ఫురించలేదు....'

ఆ అమ్మాయి ముఖంలోకే చూస్తూ వింటున్నాను. ఇప్పుడర్థమైంది ఆ అమ్మాయి కన్నుల్లో కన్నీరు ఎందుకు నిండుకున్నదో....ఆనాడే ఆ కుంభ వృష్టితోబాటే ఆమె కన్నీరు కూడా మహా ప్రవాహంలో లీనమై పోయినట్లుంది...

'ఇక ఆ గుడిసెకూ నాకూ ఏమిటి బాంధవ్యం? పిల్లని అక్కడే ఆ చాపమీద ఒత్తిగిల పడుకోబెట్టి ఒట్టి చేతులతో ఇవతలికి వచ్చేశాను... మరుక్షణంలోనే గుడిసె కుప్పలా ఆ పసిపిల్లమీద కూలిపోయింది....'

గోదావరి స్టేషను వచ్చే వరకూ మౌనంగానే కూర్చున్నాం... అడిగేందుకు ఇంక ఏముంది, చెప్పేందుకేముంది?

స్టేషనులో ఆ అమ్మాయి తండ్రి, గుడ్డి తమ్ముడూ వచ్చారు. టిక్కెట్టు కలెక్టరుకి రైల్వేపాస్ చూపించి ఆ అమ్మాయిని స్టేషను దాటించాడు తండ్రి.

నేను జట్కా మాట్లాడుకుంటున్నాను కూలివాడికి డబ్బులిచ్చేసి.

'వెళ్లొస్తానండి' అంది ఆ అమ్మాయి వెనకనుంచి వచ్చి,

'నాతో కూడారా' అన్నాను అనాలోచితంగా.

కాలు జారితే తీసుకోగలంగాని మాట జారితే మళ్ళీ సర్దుకోలేము. నాతో కూడారమ్మని తీరా అనేసిన తరవాత నాలుక కొరుక్కున్నాను. అంతలోనే మెదడులో ఓ మెరుపు మెరిసింది. దారిలో ఏ బస్సు స్టాండు దగ్గరో దింపేస్తే తను సీతానగరం వెళ్ళిపోతుంది. అంతగా లేదంటే ఇంటికి తీసికెళ్ళి కాస్త భోజనం అదీ పెట్టి పంపించవచ్చు ననుకున్నాను.

'నిజంగానే రమ్మంటున్నారా'? అంది ఆ అమ్మాయి నా మనస్సు లోని సంకోచాన్ని గ్రహించినట్లుగా.

అలా అనే సరికి నా అహం దెబ్బతిన్నది. నా ఔదార్యాన్ని శంకిం చటం సహించలేక పోయాను. ఏ మైతే అవుతుందన్న నిశ్చయానికొచ్చి ఆ అమ్మాయిని కూడా జట్కాలో ఎక్కమన్నాను. చాలా కాలానికి చిన్న నాటి ఆప్త మిత్రుణ్ణి చూసినట్లుగా సంతోషించింది. ఆ క్షణంలో ఆ అమ్మాయి ముఖంలోని అమాయకత్వాన్ని చూస్తే జాలేసింది. ఆదరాభి మానాల కోసం తపించిపోతున్న ఆ అమాయకురాలికి హఠాత్తుగా ఏదో ఆశ కల్పించి అంతలోనే నిరాశ చెందించడం న్యాయమనిపించలేదు నాకు. దారి మధ్యలో ఎలాదిగి పొమ్మనడం? ఆ మాత్రం దానికి ఎక్కమనడం దేనికి, అనుకోదూ ఆ అమ్మాయి? పోనీ ఇంటికి తీసికెడితే ఏం పోయింది? ఆలోచనలొకదరికి చేరేలోపునే ఇంటికొచ్చేశాం. వీధి అరుగు మీద పక్కింటి రాధతో కలిసి చమ్మచక్కలాడుకుంటున్న ఉష జట్కా బండి గుమ్మం ముందు ఆగి ఆగడం తోనే 'అమ్మ వచ్చేసింది! అమ్మ అమ్మ'

అంటూ చప్పట్లు చరిచింది. నేను బండి దిగగానే ఒక్క ఉరుకున వచ్చి నా కాళ్లను చుట్టేసుకుంది. దాన్ని అమాంతం ఎత్తుకు ముద్దు పెట్టుకోవాలనిపించింది.

'పాపని ఇక్కడే దిగబెట్టేశారా మీతో తీసికెళ్లకుండా?' అని అడిగిందా అమ్మాయి.

ఎందుకో అలా అడగ్గానే ఆ అమ్మాయి అంతక్రితం రైల్లో వినిపించిన విషాదగాథ అంతా గుర్తుకొచ్చి నా ఒళ్లు జలదరించింది. అమ్మయ్యో! ఇంకెప్పుడూ నా ఉషను విడిచిపెట్టి ఎక్కడికీ వెళ్లను అని మనసులోనే శపథం చేసుకున్నాను.

ఉషని ఎత్తుకుని మెట్లెక్కుతూంటే ఆయన గుమ్మంలోకొచ్చారు. నన్ను చూడగానే ఆయన ముఖంలో చిరునవ్వు మెరిసి అంతలోకే అంతర్థానమైంది. ముఖం ఎందుకో ముడుచుకుపోయింది. వస్తానన్న రోజుకి రాలేక పోయినందుకేమో ఆ అహంకారం! ఇంకా నయం? అసలు మా మేనత్త తెగ బలవంతం చేసింది. పెళ్ళికూతురుతో కలిసి మనుగుడుపులికి వెళ్లమని. మా పిల్ల బెంగపెట్టుకుంటుంది, మావారికి హోటలు భోజనం సహించదని చెప్పి. ఎంత బలవంత పెడుతున్నా మొండిగా వచ్చేశాను. పెళ్ళి పీటలమీంచి వధూవరులు దిగీ దిగగానే వెళ్లిపోతానంటే ఎవరు ఊరుకుంటారు? పెళ్లివారింట్లో అధమం ఓరోజైనా ఉండకుండా వచ్చేస్తే—అందులోనూ సొంత మేనత్తకూతురు పెళ్లికి వెళ్ళి, వెళ్లిననాడే తిరిగి వచ్చెయ్యడానికి నాకు మాత్రం మనస్సెలా ఒప్పుతుంది? అయినా, చెప్పిన ప్రకారం చెయ్యాలనే కచ్చితం ఒక్క ఆడవాళ్ల విషయంలోనే ఎందుకుండాలి! మగవాళ్లు ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించినా ఫరవా లేదు

కాబోలు! —ఈ విధంగా వాపించాలనుకున్నాను, గదిలోకి వెళ్లాక ఒకవేళ ఆయన ఈ విషయమై కేకలేస్తే.

'ఆ మనిషి ఎవరు?' కనుబొమ్మలు చిట్లించి విసుగ్గా అడిగారు. అప్పటిదాకా నాతో ఒక అమ్మాయి వచ్చిందన్న విషయమే విస్మరించినట్లు విస్తుబోయాను ఆయన ప్రశ్నకి. ఫలానా విధంగా పరిచయం చెయ్యాలని ముందుగా నేనేమీ ఆలోచించుకోక పోవడం పొరపాటే.

'రైల్లో నాతోబాటు వచ్చిందండీ' అన్నాను ఏమనాలో తోచక.

'అది సరేలే, ఇంతకీ ఎవరా మనిషి?'

'ఎవరో పాపం, భర్త, ఉన్న పిల్లలిద్దరూ పోయారు...ఇటు పుట్టింట్లోనూ అటు అత్తింట్లోనూ కూడా స్థానంలేదు...అనాథ అయిపోయింది' అన్నాను ఎంతో జాలిగా.

'ఈ కథ అంతా ఆ మనిషే చెప్పిందా నీకు?' అని గంభీరంగా అడిగారాయన.

'కథమిటండీ, నిజంగానే అన్నికష్టాలూ ఒక్కసారొచ్చాయా అమ్మాయికి, చెబుతూంటే జాలేసింది. కథ అయితే అంత కరుణ కలిగించేటట్లు ఉంటుందిటండీ?' అన్నాను.

'సరే, నీకు జాలివెయ్యడానికేంలే, కాలికింద చీమపడి చచ్చిపోతే కంట నీరు పెట్టుకుంటావ్!'

'ఏమిటండీ, మీకు మరీ వేళాకోళం!' అన్నాను ముసి ముసిగా నవ్వుతూ.

'ఆ అమ్మాయి పేరేమిటి'?

'ఏమో, అడగనే లేదు' అన్నాను నవ్వుతూ, అదేమంత ముఖ్య విషయం కాదన్నట్లు.

'ఏ కులం ఆ అమ్మాయిది?'

'నేనడగలేదు సుమండీ! కులాన్నిబట్టి కష్టాల్లో హెచ్చుతగ్గులుంటా యేమిటి? ఏదో పాపం తోటి స్త్రీ—నా అన్నవాళ్ళు లేక గిలగిల కొట్టు కుంటూంటే చూడలేక కూడా రమ్మన్నాను.'

'అంటే నీ ఉద్దేశం, శాశ్వతంగా దాన్ని పోషిద్దామనా? రాజ మండ్రీలో బోలెడు మంది అనాథలూ, ముష్టివాళ్ళూ ఉన్నారు. నీ ఔదా ర్యానికి వాళ్ళెవ్వరూ నోచుకోలేదు కాబోలు!' అలా నిలదీసి నన్ను హేళన చేస్తూంటే కళ్ళమ్మట నీళ్లు తిరిగాయి నాకు. ఉడుకు మోత్తనం వచ్చి, 'పోనీలెండి, మీకంత కష్టమైతే! మిమ్మల్నేం పోషించమనడంలేదు. నేనూ చదువుకున్నాను. నేనూ ఉద్యోగం చేసి డబ్బు సంపాదించగలను. అయినా మగవాళ్లేం చేసినా చెల్లుతుంది' అన్నాను, ఉబికి ఉబికి వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ.

ఆయన నవ్వాపుకుంటూ అవతలికి వెళ్ళిపోయారు.

ఆ రాత్రి ఉష సరిగ్గా అన్నం తినలేదు. సాయంకాలం నేను ఊరి నుంచి వచ్చేసరికి అంత ఉత్సాహంగా ఉన్నపిల్ల హఠాత్తుగా అంత మగ తగా ఎందుకున్నదో అర్థంకాలేదు. ఇవీ అవీ ఏవన్నా చిరుతిళ్ళు తిందేమో, ఆకలి వెయ్యడం లేదనుకుని, దాన్ని తీసికెళ్లి గదిలో మంచంమీద పడుకోబెట్టాను.

ఆయన ఇంకా ఇంటికి రాలేదు. ఆ అమ్మాయీ, నేనూ దొడ్లో అరుగు మీద చాప వేసుకుని కూర్చున్నాం తీరిగ్గా. కాస్సేపు ఇద్దరం మౌనంగా కూర్చున్నాం ఆకాశం వంక చూస్తూ. హఠాత్తుగా ఆయన అడిగిన ప్రశ్నలు గుర్తుకొచ్చాయి.

'ఇదిగో, నీపేరేమిటి, అడగడమే మరచి పోయాను' అన్నాను చిరునవ్వుతో.

'సత్యవతి అండి... మీపేరేమిటి?' అంది నవ్వుతూ.

మా ఇద్దరి మధ్య నిజానికి పరిచయం ఇంకా పూర్తిగా కానేలేదు. అయినా ఆ అమ్మాయి తన గత జీవితాన్నంతా నాతో చెప్పుకుంది-నేనెవరినో తెలుసుకోకుండానే, ఇలా కనిపించిన వాళ్ళందరితోనూ చెప్పుకుండా సానుభూతికోసం? ఆ సందేహం కలగ్గానే క్షణకాలం పాటు ఆ అమ్మాయి మీద అసహ్యం పుట్టింది. మళ్ళీ అనుకున్నాను.. మేము కూర్చున్న రైలు పెట్టెలో అంతమంది ఉండగా నా ఒక్కర్తెకే ఎందుకు చెప్పింది? నాలో ఏమన్నా ప్రత్యేకత గోచరించిందా? నాముఖం చూడగానే నా మనసు మెత్తనిదని తోచిందా?.... అటువంటి ఆలోచన రాగానే నాలోని అహానికి సంతృప్తి కలగింది. ఆ అమ్మాయిమీద జాలి కలిగింది.

'నువ్విక్కడే ఉండిపో, ఇంట్లో ఉండి చదువుకుందువు గాని, తరువాత మెల్లిగా ఏదైనా ఉద్యోగానికి ప్రయత్నించవచ్చు' అన్నాను సత్యవతి ముఖంలోకి చూస్తూ,

'నాకంతకన్న ఏం కావాలమ్మా! అంది తలవంచుకుని, కాస్సేపు ఊరుకుని, 'తమరెంత వరకూ చదువుకున్నారమ్మా?' అని అడిగింది.

'బి.ఎ. పాసైయాను. ఇంకాపై చదువు చదవాలనుకున్నాను. కానీ మానాన్నగారు పెళ్లి చేసేశారు అమ్మ పట్టుదలమీద.'

'అంత చదువు చదువుకుని ఊరికే ఇంట్లో కూర్చున్నారేమమ్మా ఉద్యోగం చేస్తే బోలెడు డబ్బువస్తుందికదా, అయ్యగారికిష్టం లేదా మీరు ఉద్యోగం చెయ్యడం?'

అబ్బే, ఆయన కిష్టంలేక కాదు. ఆ మాటకొస్తే అసలు వివాహానంతరం నేను ఉద్యోగంలో చేరడానికి అభ్యంతరం చెప్పరన్న వాగ్దానం తీసుకున్న మీదటే వివాహానికి సమ్మతించాను. ఆ రోజుల్లో నా అభిప్రాయాలే వేరు! భర్త భార్యను లోకువగా చూడటానికీ, ఆమెపైన అధికారం చెలాయించడానికీ. ఆమె అశక్తతకూ మూలకారణం ఆర్థికంగా ఆమె పరాధీన కావడమేననుకునే దాన్ని, అంచేత ఆడది కూడా విద్యాభ్యాసం చేసి ఉద్యోగంలోచేరి ధనాన్ని ఆర్జించినట్లయితే ఆమె ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకో గలుగుతుంది. భార్యాభర్తలు తరతమ భేదాలు లేకుండా సమానస్థాయిలో ఉండగలుగుతారు అనుకునేదాన్ని ఇంకా ఇలాగే చిత్రమయిన ఊహలు గూడు కట్టుకున్నాయి నా కన్నె మనసులో.

అసలు వివాహమే చేసుకోకూడదు. అనుకునేదాన్ని కొన్నాళ్లు. ఆ నిశ్చయంతోనే రెండేళ్లపాటు మా నాన్నగారు చేసిన పెళ్లి ప్రయత్నాలను తీవ్రంగా ప్రతిఘటించాను. నేనటువంటి నిశ్చయానికి రావడానికి కారణంతోటి సహాధ్యాయినుల ప్రభావం కొంత కారణం. వివాహం మాట తల పెట్టితేనే వికారం పుట్టి వాంతి చేసుకున్నంత పని చేసేవారు కాలేజీలో చదువుకుంటున్న ఆడపిల్లలు. నాగరిక లక్షణాల్లో అదొకటిగా పరిగణింపబడేది. దాంతో, పెళ్లి విషయం నా ముందుఎవరైనా ప్రస్తావిస్తే 'ఛీ' అని చీదరించుకోవడం అలవరుచుకున్నాను.

నాకు బాగా జ్ఞాపకం. ఆనాటితో సంవత్సరాంతం పరీక్షలై పోయాయి. నేనూ, విమల, జానకి ప్రొఫెసర్ రాఘవరావుగారి దగ్గరకు వెళ్లాం ఏవో పుస్తకాలు ఆయన కిచ్చెయ్యడానికి. ఆయన మమ్మల్ని వెంటనే పంపెయ్యకుండా, కూర్చోబెట్టి ఖాతాఖానీ మొదలెట్టారు. మా ఆశయా లేమిటో, ఆచరించదలుకున్న ప్రణాళిక లేమిటో అడగటం ప్రారంభించారు. 'ఈ సెలవుల్లో మీలో ఎవరికైనా పెళ్లయే మాట ఉన్నట్లయితే నన్ను ఆహ్వానించడం మరిచిపోకండేం' అన్నారాయన చలోక్తిగా, మేము లేచివెళ్లబోతూంటే ఆ మాటవిని జానకి 'ఛీ, మేము పెళ్లి చేసుకోదలుచుకో లేదు' అంది కసిరినట్టు, బహువచనం ప్రయోగించినందుకు నా మనస్సు చివుక్కుమంది. అప్పుడప్పుడే నా పూర్వపు అభిప్రాయాల్లో మార్పు రావడం ఆరంభమవుతోంది. ఇంట్లో మా కొత్తవదిన ఇచ్చే ఉపన్యాసాల ప్రభావంగా.

జానకి కసిరినందుకు ఆయన కోపగించుకోలేదు. 'మీరింకా పసివాళ్లు. పెళ్లి అంటే ఏమిటో తెలిసీ తెలియని పరిస్థితిలో ఉన్నారు కాబట్టి అలా అంటున్నారు...వివాహం కానట్లయితే జీవితం అసంపూర్ణమవుతుంది....ముందు ముందు మీకే అర్థమవుతుంది' అన్నారు రాఘవరావుగారు.

జీవితం అసంపూర్ణ మనడం మాట ఎలా ఉన్నా, సంఘంలో స్త్రీకి గౌరవం మాత్రం లభ్యంకాదని క్రమక్రమంగా తెలుసుకున్నాను చిన్న చిన్న అనుభవాల మూలంగా.'

ఏదో వింతలోకంలో విహరిస్తున్నట్లునే చెప్పేదంతా విస్తుబోయి వింటోంది సత్యవతి, అవునుమరి, ఇల్లూ వాకిలీ, భర్త, పిల్లలూ....తప్ప మరో వ్యాపకం ఎరుగని ఆ అమ్మాయికి కాలేజిలో చదివే ఆడపిల్లల విచిత్రమన స్తత్వం ఎలా తెలుస్తుంది?

ఉన్నట్టుండి, 'మీరు ప్రేమించి పెళ్లి చేసుకున్నా రాండీ?' అని అడిగింది.

నాకు నవ్వొచ్చింది.

ఆయన వచ్చారు లావుంది-వీధి తలుపు తట్టిన చప్పుడైంది. గబగబావెళ్ళి తలుపు తీశాను. ఆయన తిన్నగా పడకగదిలోకి వెళ్ళారు. నేనూ ఆయన్ని అనుసరించాను.

'ఉష సరిగ్గా భోం చెయ్యలేదండీ, ఎంచేతనో' అన్నాను.

మంచంమీద పడుకున్న ఉష నుదురుమీద ఆప్యాయంగా చెయ్యి వేసి, 'అరె, దాని ఒళ్ళు ఇంత వేడిగా ఉందేమిటి' అన్నారు కంగారుగా.

'కొంపతీసి జ్వరం రాలేదుకదా' అనుకుంటూ దాని ఒళ్లు ముట్టుకు చూశాను. సలసల కాగిపోతోంది నాగుండెలు దడదడ కొట్టుకున్నాయి. నూట నాలుగు డిగ్రీల జ్వరం ఉన్నట్లుగా ఉంది ఒళ్ళు. ఆయన వచ్చినది వచ్చినట్లుగానే మళ్ళీ డాక్టరు కోసం బయలుదేరారు. నాకేం చెయ్యాలో తోచలేదు. సత్యవతిని పిలిచి పిల్లని చూస్తూ ఉండమని చెప్పి పక్క వాటాలో ఉంటున్న శారదమ్మగారిని పిలవడానికి వెళ్ళాను. నా పిలుపువిని నిద్రపోతున్నావిడ ఆదరాబాదరాగా లేచి వచ్చింది. 'పిల్లకి జ్వరం వచ్చినట్లుందండీ, సాయంకాలం నేవచ్చేసరికి చక్కగా ఆడుకుంటోంది, కాస్త చూద్దురూ' అన్నాను.

ఆవిడ నామాట వినిపించుకోనట్టు, 'మీతో కూడా వచ్చినావిడెవరు?' అని అడిగింది తాపీగా.

'అదంతా ఓ పెద్దకథ లెద్దురూ. తరవాత తీరిగ్గా చెబుతాలెండి, ముందొచ్చిపిల్లని చూడండీ' అన్నాను బ్రతిమాలుతూ.

ఆవిడ నవ్వింది నాకంగారూ, ఆదుర్దాచూసి.

'ఏం ఫరవాలేదు, పిల్లకు దిష్టి తియ్యండి.. అదే పోతుంది' అంది నిర్లక్ష్యంగా. నాకు ఒళ్ళు మండింది, పిల్లని చూడకుండానే పిచ్చిపిచ్చి సలహాలు చెబుతూంటే. నాఅసహనం గమనించిందావిడ. 'కుంపట్లో నిప్పుందా?' అని అడిగింది ప్రశాంతంగా. 'ఊఁ' అన్నాను. 'కాసిని ఎండు మిరపకాయలు పట్టుకురా నామాటవిని' అంది. ఇక గత్యంతరం లేక ఆవిణ్ణి సరాసరి వంటింట్లోకి తీసికెళ్ళాను. మిరపకాయలు తీసుకుని పిల్లదగ్గరికెళ్ళిందావిడ. పిల్లని తాకనైనాలేదు. సత్యవతిని గ్లాసుడు మంచి నీళ్ళు తెమ్మని పంపింది. వెంటనే మిరపకాయలతో దిష్టి తీసింది. సత్యవతి గ్లాసుతో మంచినీళ్ళు పట్టుకొచ్చి గదిలో బల్లమీద పెట్టింది.

పిల్లలేచి మంచినీళ్ళడిగితే పట్టమని చెప్పి ఇవతల కొచ్చేసింది. నన్ను వంటింట్లోకి తీసికెళ్ళి కుంపట్లో ఎర్రగా మండుతున్న నిప్పుల్లో మిరపకాయలు వేసింది. నేను ముక్కుమూసుకున్నాను ఘాటు భరించ లేమోనని. శారదమ్మగారు నవ్వింది. 'ఏదో చాదస్తం మనిషిని, నీలా చదువుకున్నదాన్నికాదు ...పిల్లకేం ఫరవాలేదు లే—వెళ్ళొస్తాను' అంటూ మళ్ళీ పిల్లనైనా చూడకుండా వెళ్ళిపోయింది.

నాకు పిచ్చెక్కిపోతోంది. ఆయన ఎప్పుడొస్తారా అని వీధిగుమ్మం దగ్గరికి వెళ్ళడం, మళ్ళీ వెనక్కిరావడం, ఏం చెయ్యాలో తోచట్లేదు. జ్వరం ఎందుకొచ్చిందో తెలియట్లేదు.

కాస్సేపటికి వీధిలోంచి మాటలు వినిపించే సరికి ప్రాణం లేచి వచ్చింది.

డాక్టరు థర్మామీటరు పిల్లనోట్లో పెట్టి దాని నాడి పట్టుకు చూస్తూంటే, ఎలా ఉందో ఎలాఉందో నని నాగుండెలు దడదడ కొట్టు కున్నాయి.

థర్మామీటరు చూసి, 'నేను వస్తున్నానని తెలిసేటప్పటికే భయం వేసి జ్వరం పారిపోయినట్లుందే!' అన్నాడు డాక్టరు నవ్వుతూ, అక్కడికి తన హస్తలాఘవం ఇంకెంత అమోఘంగా ఉంటుందో ఊహించుకో మన్నట్లు!

'ఇందాక శారదమ్మగారొచ్చి దిష్టితీసి వెళ్ళారు' అన్నాను.

ఆమాట చెప్పగానే డాక్టరు ముఖం చిన్నబుచ్చుకున్నాడు.

అనవసరంగా రాత్రిపూట శ్రమ కలిగించి నందుకు క్షమించమని అంటూ డాక్టరుని వీధి గుమ్మందాకా సాగనంపడానికి వెళ్ళారాయన.

ఉషకి మెలుకువొచ్చింది. ఇటూ అటూ కాస్సేపు చూసింది. అంత క్రితం సత్యవతి తీసుకొచ్చి బల్లమీద పెట్టిన మంచినీళ్ళ గ్లాసు కనిపించింది లావుంది. 'దాహం' అంది. దాన్ని మెల్లిగా లేపి కూర్చోబెట్టి మంచినీళ్ళు పడుతున్నాను.

'అవునుగాని ఆయనతో అలా అన్నావేమిటి?' అన్నారు లోపలికి వస్తూనే.

అబద్ధం కాదుగా, నిజంగానే శారదమ్మగారు వచ్చి దిష్టితీసి వెళ్లింది. నేను వద్దని అంటూనే ఉన్నాను. కానీ, ఆవిడ దిష్టితియ్యగానే జ్వరం తగ్గిపోయింది—చిత్రం! పిల్లకి జ్వరం తగిలిందండి అని చెప్ప గానే, సాయంకాలం మీతో కూడా వచ్చినావిడెవరు అని అడిగింది. సత్య వతి చూపు మంచిది కాదని లావుంది ఆవిడ అభిప్రాయం' అన్నాను.

'అందుకే చదువుకున్నవాడికన్న చాకలాడు మేలన్నారు—నీకు బొత్తిగా దూరదృష్టిలేదే—ఎవరో,ఏమిటో, ఏ విషయం కనుక్కోకుండా ఏవో కల్లిబొల్లి కబుర్లు చెబితే నమ్మేస్తారా ఎవరైనా! పోనీ అంతగా నీ హృదయం ద్రవించి పోతే ఆ మనిషి చేతిలో నాలుగురూపాయలు పడేస్తారు కానీ ఇలా నెత్తికెక్కించుకుంటారుటే? పోనీ, నా మాట మీద నమ్మకం లేకపోతే, ఆ శారదమ్మగారికే సంగతంతా చెప్పి ఆవిడ సలహా అడుగు ఏ మంటుందో!' అన్నారాయన.

'మీ మాట మీదే నమ్మకం, విలువ లేకపోతే ఊళ్లో వాళ్ల మాట మీద ఉంటుందా! ఇంతకీ ఇప్పుడేం చెయ్యమంటారు నన్ను?'

ఏదో కాస్త డబ్బూ అదీ చేతికిచ్చి దాని దోవని దాన్ని వెళ్లమను!

'అయ్యొ ఎలాగండీ ఇప్పుడు' తీరా ఇంటికి తీసుకొచ్చాను—మా ఇంట్లో ఉండి చదువుకో, తరవాత ఉద్యోగానికి ప్రయత్నించుదుగాని అని ఇందాకే అన్నాను కూడాను- రేపొద్దున్న వెళిపోమంటే ఏమనుకుంటుంది చెప్పండి—ఏ మొహం పెట్టుకుని చెప్పను?' అని అడిగాను ఏడుపు మొహం పెట్టి.

'మావారి కిష్టంలేదు నువ్వుండటం—అని స్పష్టంగా చెప్పు. అన్నిటికీ ఉన్నానుగా పాపాలభైరవుణ్ణి!'

'అయితే మీరే చెప్పరాదూ ఆ అమ్మాయితో వెళ్లిపొమ్మని?'

'ఇది మరీ బావుంది! తీసుకొచ్చించి నువ్వూనూ, పొమ్మనటం నేనూనా! నీకామాత్రం యుక్తాయుక్తజ్ఞానం ఉండక్కర్లేదూ? బొత్తిగా పసిపిల్లలా ప్రవర్తిస్తే ఎలాగే?' అంటూ, చెమ్మగిల్లిన నా నయనాలను ఆప్యాయంగా తుడిచారు. ఆయన ప్రవర్తన నాకు కాస్త ధైర్యాన్ని కలిగించింది. ఆయనకి నిజంగా నామీద కోపం రాలేదని తెలుసుకున్నాను.

'కొన్నాళ్ళపాటు ఉండనివ్వండీ. ఇప్పుడు ఆ అమ్మాయి ఉండటం వల్ల మనకొచ్చిన నష్టం ఏవుంది?' అన్నాను ఆశగా ఆయన కళ్ళల్లోకి చూస్తూ.

'ముందు అన్నంపెట్టు, ఆకలేస్తోంది' అన్నారు ముఖాన్ని ఉష వైపుకి తిప్పుకుని—తన నవ్వు నాకు కనిపించకుండా ఉండాలని! నాకు తెలుసు ఆయన మనస్సు మెత్తనిదని.

మర్నాడు ఉదయమే నేను నిద్రలేచేసరికే కుంపటిమీద కాఫీ నీళ్ళు మరుగుతున్నాయి నీళ్ళపొయ్యి అంటించిఉంది. ఆ పనులు చేసినది సత్యవతే నని గ్రహించుకున్నాను. కొత్తమనిషి అయినా అంతకలుపుగోలు తనంగానూ, చేదోడు వాదోడుగానూ ఉంటుందని నేను ఊహించుకోనైనా లేదు. బ్రతుకు చేదూ తీయదనమూనూ—కానీ సత్యవతికి జీవితంలో చేదే ప్రాప్తమయింది. పాపం, నిండుకుండలాంటి సంసారం విచ్ఛిన్నమై పోయింది. సత్యవతి దురదృష్టవంతురాలు. గతస్మృతులు తప్ప సత్యవతికి జీవితంలో మిగిలిన దేమీలేదు. ఏ ఆశలు పెట్టుకొని బ్రతుకుతుందో ఏమిటో? ఆలోచిస్తూ ముఖం కడుక్కుంటున్నాను. ఇంతట్లో శారదమ్మగారి కేక వినిపించింది పెరట్లోంచి.

జయలక్ష్మి వచ్చి మూణ్ణెల్లు కాలేదు. ఈ లోపుగానే పిల్లను తీసుకుని పుట్టింటికి వెళ్ళింది చెల్లెలు పెళ్ళికని. మళ్ళీవచ్చి వారంరోజులైందో లేదో అప్పుడే పుట్టింటికి వెడుతోందని శారదమ్మగారు చెప్పేసరికి నాకాశ్చర్యం వేసింది. పోనీ, దగ్గరా దాపూకాదు చీటికీ మాటికీ వెళ్ళి రావడానికి. కోయంబత్తూరు అంటే కాస్తాకూస్తా దూరం ఉందా! మళ్ళీ వెంటనే వెళ్ళే అవసరం ఉంటుందని తెలిసినప్పుడు ఈ లోపుగా హడావిడి పడి వచ్చెయటమెందుకు!

శారదమ్మగారు కాస్త దగ్గరగా వచ్చి, గొంతు బాగా తగ్గించి 'ఆవిడ వెళ్లాలని వెళ్ళడం లేదట పాపం, అతనే పంపించేస్తున్నాడట' అంది.

'ఏమిటీ! నిజమే! ఎవరు చెప్పారు మీకు? ఎందుకు పంపించేస్తున్నాడు?'

'మా పని మనిషి ఇప్పుడే చెప్పింది. వాళ్ళింట్లో పని పూర్తిచేసి ఇప్పుడే వచ్చింది—ఆవిడ ఇక్కడికి రావడం అసలు ఆయన కిష్టంలేదను కుంటానమ్మా, ఆవిడ వచ్చినప్పటి నుంచీ మనం వింటూనే ఉన్నాంగా! మొన్న ఆవిడ ఊరునుంచి వచ్చినప్పటి నుంచీ ఏవో వాద ప్రతివాదనలు జరుగుతూనే ఉన్నాయిట. రెండురోజుల బట్టి ఆయన ఇంట్లో భోం చెయ్యడం లేదుట. ఆయన వీధిలో ఎక్కడ తింటున్నాడో ఏమిటో, ఈ వెర్రి మనిషి ఆయన కోసం కాచుకుని, పచ్చి మంచినీళ్ళయినా తాగడం లేదట. నిన్న రాత్రి ఏంగొడవ జరిగిందో ఏమిటో మరి, పొద్దున్నే పనిమనిషి వచ్చేసరికి ఆవిడ మోహమంతా ఏడ్చి ఏడ్చి ఉబ్బి నట్టుందిట. తన బట్టలూ పిల్లబట్టలూ అన్నీ పెట్టెలో సర్దుకుంటోందట. ఏంసంగతో ఏమిటో... ఇక నే వెళ్లొస్తానమ్మా, బోలెడుపనుంది—' అంటూ చకచకా వెళ్ళిపోయింది నామాట వినిపించుకోకుండానే. ఆవిడ వెళ్లినవైపు అలాగే చూస్తూ నోట్లో బ్రష్ పెట్టుకుని ఆలోచిస్తూ కూర్చుండిపోయాను—ఇంకా శారదమ్మగారు నయం! మా ఊళ్లో సూరమ్మగారు పొద్దున్నే చీకటితోనే, వార్తాపత్రిక కన్న ముందుగా ఉరుకులూ పరుగుల మీద వచ్చి 'ఏమం డోయ్ విన్నారా, వాళ్ళ రత్తమ్మగారి రెండో అమ్మాయి లేచిపోయిందట' అని ఓ ఆటంబాంబు విసిరేసి, 'ఎవరితో లేచిపోయిందండీ, ఎప్పుడండీ?' అని ప్రశ్నల పరంపర కురిపించే లోపునే ఆపక్క వీధిలోకి వెళిపోయేది.

నాలో నేనే నవ్వుకుంటున్నాను కాబోలు, సత్యవతి నవ్వి నన్ను పలుకరించేదాకా స్పృహ రాలేదు

'జయలక్ష్మి అంటే ఎవరండీ?' అని అడిగింది.

'వస్తున్నా ఉండు, ఒక్కముక్కలో చెప్పడం కష్టం ఆవిడ చరిత్రనంతా—'అని గబగబా మొహం కడుక్కోవడం కొనసాగించాను.

ఈ లోపల రాగాలాపన చేస్తూ ఉష పెరట్లోకొచ్చింది. అది ఎప్పుడూ అంతే. నిద్రలేస్తూనే 'అమ్మా, పాలు' అంటూ ఏడుస్తూ లేస్తుంది. ముఖం కడిగి పాలగ్లాసు దాని చేతి కందించేలోపున అది చేసే హడావిడి ఇంతా అంతా కాదు. అందుకే ఉష లేచిందంటే ముందు దాని పనిచూస్తేనే గాని మరోవిషయం గురించి ఆలోచించను.

ఆయన ఇంకా నిద్ర లేవలేదు. వంటింటి వసారాలో కూర్చున్నా-సత్యవతీ నేనూ. నేను కూర్చుంటే ఉష సింహాసనం ఎప్పుడూ నా ఊరువే!

'సరిగ్గా మా ఉష ఈడుదే ఆ జయలక్ష్మి కూతురు —వీళ్ళిద్దరికీ స్నేహం కూడా బాగానే కుదిరింది. ఎరగని వాళ్ళు కవల పిల్లలా అని అడుగుతూ ఉంటారు—ఇంతకీ పాపం ఆ పిల్ల అదృష్టం ఎలాఉందో? ఒక్కొక్కళ్ళ జన్మకాల నక్షత్రమే ఆటువంటిది...'

'ఏమండీ, ఆ పిల్లకేమైంది? అవిణ్ణి భర్త ఎందుకు పంపిచేస్తున్నాడు పుట్టింటికి?'

'ప్రొఫెసర్ మీకన్ అని ఒకాయన ఉన్నాడులే, మనింటికి రెండిళ్ల వతల ఆయన కూడా ఆర్ట్సు కాలేజిలోనే పని చేస్తున్నాడు. ఈ మధ్యే, ఓపది నెల్లయిరది ఆయన ఇంగ్లండు నుంచి వచ్చి. ఆయన భార్య జయ

లక్ష్మి. ఆవిడ ఈఊరొచ్చి మూణ్ణెల్లయింది—అంతే. ఇంగ్లండు నుంచి వచ్చాక భార్యని కాపురానికి తీసుకురావడం ఇదే. మొదట్లో ఆయన బ్రహ్మచారేమో అనుకునే వాళ్ళం మేమంతా. అసలు సంగతి తరవాత తెలిసింది.

పెళ్ళయిన సంవత్సరానికే మీనన్ ఇంగ్లండుకి వెళ్ళాడుట వెళ్ళే సమయానికి ఆవిడకి కొత్తగా నెల తప్పినట్టుంది. మూడేళ్ళు పోయాక వచ్చాడుట ఇంగ్లండు నుంచి. వచ్చి, ఈ పిల్ల తనకి పుట్టింది కాదు అంటాడుట. ఆ జయలక్ష్మి, ఆవిడ తల్లిదండ్రులూ ఒకటేగోల. పాపం, ఎంతకీ కాపరానికి తీసుకురాకపోయేసరికి, ఆ తండ్రే మూణ్ణెల్లక్రితం కూతుర్నీ మనవరాల్నీ ఇక్కడ దిగవిడిచి వెళ్ళాడు. ఆవిడరావడం మీనన్ కిష్టం లేదు.'

'అయితే, ఆయన తల్లితండ్రులకి మాత్రం నిజం తెలియదాండీ? కొడుక్కి నచ్చజెప్పలేదూ?' అని అడిగింది సత్యవతి.

'అది జరిగితే అదృష్టం బాగానే ఉండునేమో. అత్తగారికీ సంబంధం ఇష్టం లేదుట. ఇస్తామన్నంత కట్నం ఇవ్వలేకపోయారుట పెళ్ళిలో? ఆడబడుచులికి అసహ్యం. ఆ మాత్రం దానికే కోడలికి అన్యాయంచేస్తారా. కొడుకు అనుమానిస్తుంటే నచ్చజెప్పడం పోయి, ఏమో మాకు తెలియదంటే మాకు తెలియ దన్నారుట. ఇప్పుడీ జయలక్ష్మి బ్రతుకు అధోగతి పాలవుతుంది కాబోలు...'

'ఏమే' అని ఆయన ఒక్కసారి పొలికేక పెట్టేసరికి ఉలిక్కిపడ్డాం సత్యవతీ, నేనూ.

'ఆదేమిటండీ, ఇంత చదువుకున్నవారు మీరు...మిమ్మల్ని ఏమే అని పల్లెటూరి ఆయనలా పిలుస్తున్నారేమిటండీ!' అని నవ్వింది సత్యవతి.

'ఆయన పోలికే ఈ ఉష తల్లికి...పొద్దున్నే లేస్తూనే కాఫీ కోసం పొలికేకలు!'

పడకగదిలోకి వెళ్ళిచూస్తే ఆయన ఇంకా మంచం దిగనైనా లేదు. ఒళ్ళు మండింది నాకు.

'ఏమండీ, మీ మీనన్ భార్యని పుట్టింటికి పంపించేస్తున్నాడుట.... అదేం ఒళ్ళు పొగరు?' అన్నాను కాస్త ఘాటుగా.

'అవును, ఇష్టం లేని దాంతో కాపురం ఎలా చేస్తాడు? లాయర్‌తో అన్నివిషయాలూ మాట్లాడి ఆవిణ్ణి పుట్టింటికిపంపే ఏర్పాట్లు చేసుకున్నాడు. మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడు' అన్నారాయన ఎంతో ప్రశాంతంగా. ఆ మీనన్‌ని తలుచుకుంటున్న కొద్దీ నా మనసులో మంటలులేస్తున్నాయి.

'పోనీ, అంత ఇష్టంలేనివాడు వ్యవహారాన్ని ఆ ఊళ్లోనే ఫైసలు చేసుకోబోయాడా! ఆవిడ ఇక్కడ కొచ్చేదాకా చడీచప్పుడు కాకుండా ఊరుకుని ఇప్పుడిలా ఆవిణ్ణి నలుగురిలోనూ నవ్వులపాలు చేయడం ఏమి న్యాయం? ఆవిడ మనస్సు ఎంత కుమిలిపోతుంది!...' అని నేను ఉద్రేకంతో చెప్పుకుపోతూంటే, ఆయన నాకన్నుల్లోకి కాస్సేపు తీక్షణంగా చూసి 'మధ్య నీకెందుకూ?' అన్నారు. ఆ మాటకి నాకు మరింత ఉద్రేకం వచ్చింది.

'నాకెందుకేమిటి? ఇలాంటి అన్యాయం పనులు చేస్తుంటే చూస్తూ ఊరుకోవలసిందేనా? పైగా ఉపాధ్యాయుడు కూడాను. వీళ్ళే ఇటువంటి వెధవ పనులు చేస్తూంటే ఇక వీళ్ళదగ్గర పాఠాలు నేర్చుకునే విద్యార్థులేం బాగుపడతారు? సంఘమంతా ఇంటువంటి విషబీజాలతో నిండి పోవల్సిందేనా?...'

'ఒసేయ్! ఆనక తీరికుంటే, సంఘంలోని చీడపురుగుల గురించి సావధానంగా చర్చిద్దాంగానీ, ముందు ఓ కప్పువేడి కాఫీ పట్టుకురా, తల బద్దలైపోతోంది' అన్నారు నవ్వుతూ.

'మీకంత వేళాకోళంగా ఉందేమిటంట? ఒక పక్క ఆవిణ్ణి అన్యాయంగా పుట్టింటికి పంపించేస్తుంటే మన మంతా ఇలా చేతులు ముడుచుక్కూర్చోవలసిందేనా...? మీ తోటి ఉద్యోగి కదా, ఆ మాత్రం నోట్లో గడ్డి పెట్టలేరూ?' అన్నాను ఒళ్లుమండి.

'ముందు నువ్వు వెళ్లి కాఫీ పట్టుకురాకపోయావంటే ఆ గడ్డి నీ నోట్లోనే పెట్టాల్సి వస్తుంది' అని ఆయన అనే సరికి, గత్యంతరం లేక వంటింటివైపు వెళ్లాను.

ఎంత నిగ్రహించుకుందామనుకున్నప్పటికీ, శారదమ్మగారు వెడుతూంటే ఆవిడతో కలిసి బయలుదేరకుండా ఉండలేక పోయాను. జయలక్ష్మి పుట్టెడు దుఃఖంతో పుట్టింటికి వెడుతూంటే పలకరించకుండా ఉండటానికి నాకుమనసొప్పలేదు. ఇంట్లో ఉష నిద్రపోతోంది. మళ్ళీ అది లేచిందంటే కూడా వస్తానని పేచీ పెడుతుంది. ఉషని చూడగానే జయలక్ష్మి తన కూతురు ముందు బ్రతుకు తలుచుకుని మరింత కుమిలి పోతుందేమో, ఎందుకైనా మంచిది, ఉషలేచే లోపుగానే ఒక్కమాటు వెళ్లి పలకరించివస్తే బావుంటుందనుకుని, శారదమ్మగారు వెడుతూ వెడుతూ, వస్తావుటమ్మా అని అడగగానే వెంటనే బయలుదేరాను.

పలకరించగానే జయలక్ష్మి ఖోరుమని ఏడుస్తుందేమోనని భయం వేసింది నాకు. ఎవరైనా బాధ పడుతూంటే సానుభూతితో నా హృదయం ద్రవించి పోతుంది. కానీ వ్యక్త పరచడం చాత కాదు నాకు. ఆడదాన్నే అయినా, ఎవరైనా చచ్చిపోయినప్పుడు వాళ్ల బంధువులు గుండెలు బాదుకు

ఏడుస్తూంటే ఆదృశ్యాన్ని తలుచుకోవడానికే నాకు భయం. అంతవరకూ దేనికి? బి.ఎ.లో మా క్లాస్‌మేట్ కామేశ్వరి పరీక్షపోతుందని ఎవ్వరూ అనుకోలేదు. పరీక్షపోయిందని తెలిశాక, కామేశ్వరి ఇంటికి వెళ్లి ఎలాగ ఓదార్చాలో తెలియక తికమక పడ్డాను. అంతకన్న నా పరీక్షపోయినా బావుండేదనిపించింది. నిజంగా కష్టాలంటే ఏమిటో నాకు అనుభవ పూర్వకంగా తెలియదు ఇంత వరకూ.

జయలక్ష్మి ఇంటిని సమీపిస్తున్న కొద్దీ నా మోకాళ్ళు ఒణుకుతూ అడుగులు తడబడుతున్నాయి, నా ముఖమంతా చిరుచమటలతో నిండి పోయింది. పక్కన శారదమ్మ గారు ఉండబట్టి సరిపోయింది.

ప్రయాణానికి సిద్ధంగా ఉంది జయలక్ష్మి. మమ్మల్ని లోపలికి వచ్చి కూర్చోమంది. ఎంతో ధీమాగా మాట్లాడే శారదమ్మగారే ఎలా పలకరించాలో తెలియక తికమక పడింది. కర్ర గుర్రం ఎక్కి అమాయకంగా ఆడుకుంటున్న జయలక్ష్మి కూతుర్ని దగ్గరకు తీసుకున్నాను నేను.

'మీ ఉషని తీసుకురాలేదమండీ?' అని జయలక్ష్మి పలకరించింది. 'మీరు మొన్న ఊరికెళ్లినప్పుడు పగలంతామా ఇంట్లోనే ఉండి మా అమ్మాయితోనే ఆడుకునేది' అంది. నేను చిరునవ్వు నవ్వి ఊరుకున్నాను. వచ్చినది మా ఉష గురించి మాట్లాడేందుకు కాదు కదా.

'ఏమండీ, అర్థమంత్రంగా ప్రయాణం పెట్టుకున్నారు?' శారదమ్మ గారు ఏమీ ఎరగనట్టు అడిగింది.

జయ క్ష్మి ఏమని సమాధానం చెబుతుందోనని గుండెలు బిగపట్టుకుని చెవులు నిక్క బొడుచుకుని కూర్చున్నాను. జయలక్ష్మి ముఖంలో ఎక్కడా విచారచ్ఛాయలే గోచరించలేదు. ముఖంలో గాంభీర్యం ఉట్టిపడుతూ నిండుకుండలా ఉంది.

మా అమ్మకి ఒంటో బాగాలేదండీ, ఒకసారి చూసివద్దామని వెడుతున్నాను' అంది. శారదమ్మగారు మళ్ళీ కిక్కురు మనలేదు. జయలక్ష్మి తన గోడు అంతా చెప్పుకుని వల వల ఏడుస్తుందేమో, మగవాళ్ళనందరినీ ఒక్కసారి దుమ్మెత్తిపోసి, జయలక్ష్మిని ఓదార్చి, అక్కడి కేదో ఘన కార్యాన్ని సాధించినట్లు సంతృప్తిగా ఇంటికి రావచ్చుననుకుంది లావుంది ఆవిడ. జయలక్ష్మి కించిత్తు కూడా చలించక పోయేసరికి శారదమ్మగారి ముఖం చిన్నపోయింది. నా మట్టుకు నాకు మనస్సు తేలిగ్గా ఉంది.

ఇంటికి వెళ్ళేసరికి, అప్పుడే ఉష నిద్రలేచినట్లుంది. రాగా లాపన చేస్తూ మా అమ్మ ఎక్కడికి వెళ్ళిందని నిలదీసి అడుగుతోంది సత్యవతిని.

వెళ్ళి చాపమీద చతికిలబడ్డాను. ఉష నా ఒళ్ళో కూర్చుంది. సత్యవతి ఎదురుగా నేలమీద కూర్చుంది. జయలక్ష్మి గురించే నా ఆలోచనలు పోతున్నాయి. జయలక్ష్మి కూతురికి తల్లిపోలిక బదులు తండ్రి పోలికే వచ్చిఉంటే అదృష్టం ఇలా తల్లక్రిందు లయేదా? భగవంతుడు ఆడదాని పైన పక్షపాతం చూపిస్తాడెందుకో?

'ఏమండీ, అయ్యగారికి నేనిక్కడ ఉండటం ఇష్టంలేదా?'

హఠాత్తుగా నెత్తిమీద పిడుగు పడ్డట్లయింది. సత్యవతికేసి అయోమయంగా చూశాను. అటువంటి ప్రశ్న వెయ్యవలసిన అగత్యం ఏమిటో, ఊరి నుంచి వచ్చాక ఇంతవరకూ కలగని సందేహం ఇప్పుడే ఎందుకు కలిగిందో అర్థం కాలేదు. నా నోటమ్మట మాట రాలేదు.

'అయ్యగారికి నేనిక్కడ ఉండటం ఇష్టం లేదనుకుంటానండి.' రెట్టించింది సత్యవతి.

సందేహాస్పదంగా సత్యవతి ముఖంలోకి చూశాను. 'మీరు వాళ్ళింటికి వెళ్ళగానే అయ్యగారు కాలేజినుంచి వచ్చారండి. రాగానే మీకోసం

కేకేశారు. నేను వంటింట్లో కాఫీ కలుపుతున్నానండి. చూసి, ఏం మాట్లాడకుండా వీధిలోకి వెళ్ళిపోయారు' అని సత్యవతి తలవంచుకుంది.

నాకు కాస్త ఊపిరి పీల్చుకోవడానికి ఓపిక వచ్చింది. మనసులోనే నవ్వుకున్నాను..

'ఆయన ఎప్పుడూ అంతే. పరాయిస్త్రీలను చటుక్కున చనువుగా పలకరించరు. నువ్వుండటం ఇష్టంలేక కాదు' అని నచ్చజెప్పాను. సత్యవతికి సంతృప్తి కలిగింది లావుంది, ఇంకేమీ మాట్లాడలేదు.

రాత్రి ఆయనతో ఈ సంగతి నేను చెప్పలేదు. కానీ, ఆయనే అడిగారు నవ్వుతూ, 'మీ శిష్యురాలు విద్యాభ్యాసం ఆరంభించిందా?' అని 'ఇంకా లేదు, ఏదన్నా మంచి రోజు చూసి మొదలు పెట్టాలి, ముహూర్తం చూడండి' అన్నాను నేను కూడా నవ్వేస్తూ.

మర్నాడు సూర్యగ్రహణం. పట్టు విడుపు అయే సమయానికి పది గంటలూ ఆ ప్రాంతాల్లో శారదమ్మగారు వచ్చి గోదావరి స్నానానికి రమ్మంది. సత్యవతి సరదా పడింది. ఉష గంతులు చెప్పనే అక్కర్లేదు. దానికి నీళ్ళు చూస్తే వెర్రి సంబరం. సరేకదా అని, అందరం బయలుదేరాం.

మా ఇంటికి గోదావరి చాలా దగ్గర. ఒడ్డుకి వెళ్ళడానికి పట్టుమని అయిదు నిముషాలు కూడా పట్టదు. గోదావరి ఎంతో పవిత్రమైన పుణ్యనది అనీ, గోదావరీ తీర్థం సేవించేందుకూ గోదావరి జలాల్లో స్నానంచేసి తమ శరీరాలను పావనం చేసుకునేందుకూ అనేక మంది యాత్రికులు దూర ప్రాంతాలనుండి ఎంతో శ్రమపడి, ధనవ్యయం చేసుకుని వస్తూ ఉంటారు. పుష్కరాల్లో ఇంక గోదావరి తీర్థంలో ఉండే హడావిడి వర్ణనాతీతం. జనం తండోప తండాలుగా వస్తారు. కానీ ఊళ్ళో ఉన్న మేము

మాత్రం ఎప్పుడూ గోదావరిలో స్నానమే చెయ్యం. గోదావరిలో ఎంత పవిత్రత ఉంటుందంటారో, అంత అశుభ్రత కూడా ఉంది. పవిత్రత కంటికి కనిపించదు. ప్రత్యక్షంగా కనిపించేది అశుభ్రత ఒక్కటే. గోదావరిలో నానారకాల మనుషులూ స్నానాలు చేస్తారు. ఒకవైపు నుంచి చాకలివాళ్ళు నానారకాల మైలబట్టలూ ఉతుకుతుంటారు. మరోవైపు నుంచి కొందరు కాలకృత్యాలు తీర్చుకుంటూ ఉంటారు. మరోచోట బ్రాహ్మణులు స్నానం చేస్తూ పవిత్ర గోదావరీ తీర్థాన్ని భక్తి ప్రపత్తులతో ఆస్వాదిస్తూ ఉంటారు. ఇంకోచోట కొంటె పిల్లలు ఈతలాడుతూ ఉంటారు. మొత్తంమీద గోదావరి నానా భీభత్సం గానూ ఉంటుంది. ఆ దృశ్యాలను చూస్తుంటే స్వచ్ఛంగా ఉన్న శరీరాన్ని ఉత్తి పుణ్యానికి కలుషితం చేసుకోవడం దేనికి అనిపిస్తుంది. అందుకే ఎప్పుడూ గోదావరిలో స్నానం చెయ్యబుద్ధిపుట్టదు. చివరికి గోదావరి ఒడ్డుకి షికారుకి కూడా వెళ్ళము. వెడితే ఆ దుర్గంధాన్ని భరించడం మన తరం కాదు. ఎప్పుడో గాంధీగారి మరణవార్త విన్నప్పుడు మైలస్నానం చెయ్యడానికి మా ఊరు వాళ్ళంతా వెడుతూంటే మేమూ వెళ్ళాం, అంతే.. మళ్ళీ ఇదే వెళ్ళడం.

ఉషని నీళ్ళల్లోకి తీసుకువెళ్ళకుండా మెట్టుమీదే నుంచోపెట్టి స్నానం చేయించి, తరవాత ఒడ్డుమీద కూర్చోబెట్టి తువ్వాలు కప్పాను.

ఎరిగున్న వాళ్ళు బోలెడుమంది వచ్చారు స్నానానికి. అందరం కబుర్లు చెప్పుకుంటూ నీళ్ళలోకి దిగాము. నడుంలోతుకన్న నేను రాను బాబోయ్ అంటుంటే గుండెలోతు వరకూ తీసుకుపోయారు శారదమ్మ గారూ వాళ్ళు కలసి. గోదావరి నీళ్ల అశుభ్రమైన వన్నమాట అలాఉంచి నాకు చిన్నతనం నుంచీ నదిలో స్నానం చెయ్యడమంటే భయం. అడుగున కాళ్లు తేలిపోతున్నట్లుగా ఉంటుంది. ముక్కుమూసుకుని బుడుంగున

మునగటమంటే మరీ భయం. శారదమ్మగారు పకపకా నవ్వుతూ "అదేమిటమ్మా మరీ చిన్నపిల్లలాగ!" అంటూ నా తలపట్టుకుని మూడుసార్లు ముంచింది నీళ్ళలో. పుణ్యం రావడం మాట దేవుడెరుగును, ఉక్కిరిబిక్కిరైపోయి ఊపిరి సలపలేదు.

ఇంతలోకే 'అమ్మా, అమ్మా, ఉషమ్మ ఏదమ్మా?' కంగారుగా కేకలు పెట్టింది సత్యవతి. 'అయ్యో, అయ్యో, పసిపిల్ల ఏదమ్మా' అంటూ లబోదిబో మంది శారదమ్మగారు.

'ఏదీ, నాఉష తల్లి ఏదీ?' నలుదిక్కులా శూన్యంగా కలయచూశాను. నాతల గిర్రున తిరిగి పోతోంది. అక్కడున్న ఆడవాళ్ళంతా శాయశక్తులా చుట్టుపక్కలంతా వెతికారు...నాకన్నతల్లి ఉష ఎక్కడా కనిపించలేదు. అల్లారు ముద్దుగా మూడేళ్ళొపెంచి చివరికి చేజేతులా గోదావరికి బలిచేసుకున్నాను. ఒట్టిచేతులతో ఇంటికెలావెళ్ళను? ఆ శూన్యగృహంలో ఎలా అడుగుపెట్టను? నా శిరస్సుమీద నుంచి కారే గోదావరీ జలాలతో కలిసి నా కన్నీరు ధారలై పారుతోంది. చుట్టూరా చేరిన అమ్మలక్కలంతా తలోకమాటా అంటున్నారు. 'పిల్లని గట్టుమీద ఉండమంటే ఉంటుందిటమ్మా, అంతా స్నానాలు చేస్తూంటే చూస్తూ ఊరుకుంటుందా?' అంటోందొకావిడ సాగదీస్తూ. 'ఎవరినైనా చూస్తూ ఉండమని చెప్పి అయినా నువ్వు నీళ్ళలోకి దిగాల్సింది' అంటోంది మరొక ముత్తైదువ. నా అంతరాత్మే నన్ను దూషిస్తున్నప్పుడు అందరూ నిందించడంలో ఆశ్చర్యమేముంది? పాప పరిహారంగా ఈ పవిత్ర గోదావరిలోనే ప్రాణత్యాగం చేస్తానని నదిలో దూకుతూంటే నలుగురూ నన్ను నిరోధించారు. శారదమ్మగారు నా రెక్కపట్టుకుని ఇంటిదాకా ఈడ్చుకొచ్చి, చెవిలో చెప్పింది....

'నీకు తల్లిలాంటి దాన్ని, ఎందుకు చెబుతున్నానో విను....ఆ శని దేవత మీఇంట్లో పాదం ఎప్పుడైతే పెట్టిందో అప్పుడే అనుకున్నాను... ఏదో అరిష్టం సంభవిస్తుందని. ఇంట్లో జ్యోతిలా కలకల్లాడుతూ వెలిగే పసిపాపని పొట్టని పెట్టుకుంది. ఒక్కొక్కళ్ళ పాపిష్టి పాదం ఎక్కడ మోపితే అక్కడే అశుభం తాండవిస్తుంది. నామాటవిను...ఆ సత్యవతిని పంపించెయ్యి....అనాధలైన వారినందరినీ నమ్మి ఇంటికి చేరదీస్తే సర్వ నాశనం తప్పదు. అటువంటివి ఏమైనా సంఘాలూ సంస్థలూ చెయ్యవలసి నవి కానీ వ్యక్తులు చెయ్యవలసిన పనులుకావు. నీ సంసారం ఇకనైనా చల్లగా ఉండాలంటే నా సలహావిను....'

'ఏ మోహం పెట్టుకుని ఆయనకి నచ్చజెప్పను? నా ఉషతల్లి లేకుండా ఈ ఇంట్లో ఎలా బ్రతకగలను?' శారదమ్మగారిని కౌగలించు కుని హృదయం బద్దలయేలా విలపించాను.

'అంతేనమ్మా, ఒక్కొక్కప్పుడు పుణ్యానికి పోతే పాపం ఎదురవు తుంది, ఏడవకు తల్లీ.'

(వనిత (ఆంధ్రయువతీ మండలి), జూలై, ఆగస్టు, సెప్టెంబరు, నవంబరు, డిసెంబరు'56)